రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సుద్దపల్లి విద్యార్థులకు బంగారు పతకం

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5 : మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. మెదక్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో మొదటిస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. త్వరలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన ఎల్.రాణి, వైశాలి, ప్రణీత, సాత్విక, సావిక, నేహశ్రీ, బిందు, నేహ, గంగోత్రిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో దీప్తివాణి, జూనియర్ అసిస్టెంట్ వనిత, ఫిజికల్ డైరెక్టర్ నల్లూరి లత, జన్నేపల్లి మౌనిక, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో మోర్తాడ్ విద్యార్థుల ప్రతిభ

మెడల్స్, ప్రశంసపత్రాలను అందుకుంటున్న మోర్తాడ్ విద్యార్థులు

మోర్తాడ్, ఫిబ్రవరి 5: ఈనెల 2 నుంచి 4వరకు విశాఖపట్టణంలో నిర్వహించిన ఏడో అంతర్జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మోర్తాడ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈపోటీల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో తెలంగాణ నుంచి మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఐదుగురు విద్యార్థులు కటాసార్‌రింగ్ విభాగంలో ప్రతిభ చాటారు. అండర్-12 విభాగంలో ప్రణతి, అండర్-14 విభాగంలో శ్రీనిధి బంగారు పతకాలను సాధించారు. అండర్-14 విభాగంలో అంజలి, శ్రీకృతి వెండి పతకాలను, అండర్-10 విభాగంలో రిత్వేశ్ కాంస్యపతకాలు సాధించారు.

గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులకు శిక్షణ

డిచ్‌పల్లి/బోధన్/ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 5 :డిచ్‌పల్లిమండలంలోని మానవతాసదన్‌లో డివిజన్ లెవల్ గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఆర్డీవో రాజేంద్రకుమార్.. ప్రత్యేకాధికారులకు గ్రామపంచాయతీ పరిపాలన, నిర్వర్తించాల్సిన విధులు, వారి బాధ్యతలను వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని డీపీవో సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించాలన్నారు. నిజామాబాద్ డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

బోధన్ డివిజన్‌లోని ప్రత్యేకాధికారులకు శిక్షణ కార్యక్రమం బోధన్ పట్టణంలోని మండల పరిషత్ సమావేశం హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ మాట్లాడారు. నిజామాబాద్ డీఎల్‌పీవో గౌసుద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీనాయక్, శిక్షణ అధికారి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రైతు వేదిక భవనంలో డివిజన్‌లోని ప్రత్యేకాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌పీవో శ్రీనివాస్ మాట్లాడారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం ఇవ్వాలి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5: 61 సంవత్సరాల పైబడిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ జగిత్యాల జిల్లా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించి ఆర్డర్స్ ఇప్పించడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. సజ్జు, శంకర్, శ్రీనివాస్, మూర్తి పాల్గొన్నారు.

బోధన్‌లో మెగా రక్తదాన శిబిరం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్, ట్రస్ట్ నిర్వాహకులు

బోధన్, ఫిబ్రవరి5: పట్టణంలో సోమవారం బోధన్ కేంద్రంగా పనిచేస్తున్న ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది దాతలు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, బాన్సువాడ ప్రభుత్వ దవాఖానలకు తరలించారు. రక్తదాన శిబిరాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. రక్తదాతలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి సర్టిఫికెట్లను పంపిణీచేశారు. ట్రస్ట్ నిర్వాహకులు ఆరోగ్యజ్యోతి, ఎంఎఫ్ రాజు దంపతులు, ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

నగరంలోని ఖిల్లా జైలును గూపన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. ఖిల్లా, రామాలయం, దాశరథి, వట్టికోట ఆళారు స్వామిని నిర్బంధించబడిన జైలు గదులు తదితర వాటి గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

సారంగాపూర్, ఫిబ్రవరి 5

ఈవీఎం గోడౌన్ పరిశీలన

ఈవీఎం గోడౌన్‌లో వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 5 : జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్డ్, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రాథమిక పరిశీలన (ఎఫ్ఎల్‌సీ) జరిపేందుకు ఈసీఐఎల్‌కు చెందిన 17 మంది సాంకేతిక నిపుణుల బృందం 10 రోజుల క్రితమే జిల్లాకు చేరుకున్నట్లు తెలిపారు. స్థానికంగా ఉన్న 2916 బ్యాలెట్ యూనిట్లు, 1752 కంట్రోల్ యూనిట్లు, 2373 వీవీ ప్యాట్లను నిపుణుల బృందం పరిశీలిస్తుందని ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ కొనసాగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, నిబంధనలు తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి కృష్ణవేణి, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్‌కుమార్, భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, సంతోష్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో వైజ్ఞానిక ప్రదర్శన

బోధన్, ఫిబ్రవరి 5: పట్టణంలోని శ్రీ విజయసాయి హైస్కూల్‌లో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏర్పాటైన అటల్ టింకరింగ్ ల్యాబ్ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. శ్రీ విజయసాయి హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రదర్శించారు. ప్రదర్శనను బోధన్ ఎంఈవో నాగనాథ్ ప్రారంభించారు. జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ ప్రాజెక్టులను పరిశీలించారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు, సైన్స్ విభాగం ఉపాధ్యాయులు సందర్శించారు. శ్రీ విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్, పీఆర్‌వో ఐఆర్ చక్రవర్తి, అకాడమిక్ ఇన్‌చార్జి సువర్చల, సైన్స్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

'తప్పుడు పత్రాలతో తప్పుదోవపట్టిస్తున్నారు..'

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి5: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ కుర్చీ కోసం అధికారులతో కుమ్మక్కై రిపోర్టులు తారుమారు చేస్తున్నారని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అన్నారు. సోమవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా మాట్లాడుతూ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పండిత్ వినీత తప్పుడు పత్రాలను చూపించి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కుర్చీపై కూర్చోవడం సబబు కాదని అన్నారు. తప్పుడు రిపోర్టుల విషయంలో ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ కలెక్టర్‌కు రాసిన అంతర్గత లెటర్‌తోనే వారు గెలిచినట్లు చూయిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి వారికి బుద్ధి చెపుతామని అన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

జీపీ పాలకవర్గాలకు సన్మానం

మోస్రా (చందూర్)/ కోటగిరి/ ఇందల్వాయి/మోపాల్ (ఖలీల్‌వాడి), ఫిబ్రవరి 5 : మోస్రా మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులను మోస్రా రైతు వేదికలో సన్మానించారు. జడ్పీటీసీ సభ్యుడు గుత్ప విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, వైస్ ఎంపిపి శంకర్, ఎంపీటీసీ మమత, ఎంపీడీవో భారతి, ఎంపీవో రఫీ, తహసీల్దార్ శ్రీకాంత్‌రావు, ఉపతహసీల్దార్ సాయిలు, సర్పంచులు సుమలతారాం రెడ్డి, నరేందర్‌రెడ్డి, విమలాలింగయ్య, సున్నం భూమయ్య, ఫెరోజ్ పాల్గొన్నారు. పోతంగల్ మండలంలోని సోంపూర్ సర్పంచ్ భాగ్యలక్ష్మీనాగరాజుగౌడ్, పాలకవర్గ సభ్యులకు గ్రామస్తులు సన్మానించారు. ఇందల్వాయి మండలంలోని దేవీతండా సర్పంచ్ అంబర్‌సింగ్‌తోపాటు పాలకమండలి సభ్యులను ఎంపీపీ రమేశ్‌నాయక్ సన్మానించారు. మోపాల్ మండలంలోని మంచిప్ప సర్పంచ్ సిద్ధార్థ, ఉపసర్పంచ్ జగదీశ్వర్, వార్డుసభ్యులను సన్మానించారు.



మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఉచిత వైద్య శిబిరం

విద్యార్థికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

కోటగిరి, ఫిబ్రవరి 5 : మండల కేంద్రంలోని శ్రీవేద హైస్కూల్ ఆవరణలో బోధన్ లైఫ్ కేర్ డెంటల్ దవాఖాన, లయన్స్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. డాక్టర్లు ఇర్ఫాన్ అలీ, సతీశ్.. విద్యార్థులకు దంత, కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తేళ్ల రవి కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ అధ్యక్షుడు హన్మంతరావు, కప్ప సంతోష్, లక్ష్మం రాజు, యోగేశ్, ఉమాకాంత్, సిబ్బంది రేష్మ, నిర్మల, చంద్రకళ, సంగీత, సాయినాథ్, రమేశ్, నాగరాజు, భీంరావు, గౌతమి, శ్రావణి, కావ్య, అను పాల్గొన్నారు.

న్యాక్‌సెంటర్‌ను రద్దు చేయొద్దు

మోర్తాడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్, ఫిబ్రవరి 5: విద్యార్థులు, నిరుద్యోగ యువకుల కోసం మండల కేంద్రలో రూ.5కోట్లతో నిర్మించతలపెట్టిన న్యాక్‌సెంటర్ రద్దు జీవోను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వెనక్కితీసుకుని విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు మేలు జరిగేలాచూడాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా డిమాండ్ చేశారు. మోర్తాడ్‌లో టీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈప్రాంత నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం మోర్తాడ్‌లో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.5కోట్లతో న్యాక్ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో భూమి సేకరించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. న్యాక్ సెంటర్ రద్దు జీవోను వెనక్కి తీసుకోని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మండలకోఆప్షన్ మెంబర్ ఇంతియాజ్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సుదర్శన్, మండల నాయకులు గందం మహిపాల్, అజార్, శ్రీకాంత్, గంగాధర్, సాయిరాం, మహేందర్, టీఆర్ఎస్‌వీ నాయకులు వినయ్, రోహిత్, సాయి, ఉదయ్, సాహిద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ 2007-08 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పూర్వ గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. అనంతరం మాజీ సర్పంచ్ కల్లెం మోహన్‌రెడ్డిని సన్మానించారు.

– ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి5

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

నవీపేట, ఫిబ్రవరి5: మండలంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందగా మరో ఇద్దరి కూలీలకు గాయాలైనట్లు ఏఎస్సై మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. ధర్మాబాద్‌కు చెందిన షేక్ సోహేల్(24) తన సోదరురుడు షేక్ చౌకత్ మరో కూలీ బుద్ధవాన్ కాంబే మోటర్‌సైకిల్‌పై నవీపేటకు సిమెంట్‌లోడును ఖాళీ చేసేందుకు వస్తున్నారు. నాగేపూర్ బాసర రోడ్డు మూల మలుపు వద్ద మోటర్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న సిగ్నల్ స్తాంభాన్ని ఢీకొంది. సోహేల్‌కు తీవ్రంగా, మరో ఇద్దరి స్వల్పంగా గాయలయ్యాయి. సోహేల్ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. సోహేల్‌కు ఆరు నెలల క్రితం మాక్లూర్‌కు చెందిన ఓ అమ్మాయితో పెండ్లి అయ్యింది. మృతుడి సోదరుడు షేక్ చౌకత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి ఒకరు..

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5: మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన మల్లూరి రాజు (50) ఆదివారం రాత్రి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ సోమవారం తెలిపారు. మానసిక ఆరోగ్య స్థితి బాగాలేక, ఒంటరితనం భరించలేక మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి ఎస్సారెస్పీలో ఒకరి గల్లంతు

ముప్కాల్, ఫిబ్రవరి5: మండల కేంద్రానికి చెందిన అనికేషి రమేశ్(46) శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో చేపల వేటకు వెళ్లి గల్లంతైనట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం చేపల వల వేసేందుకు వెళ్లిన రమేశ్ ఒడ్డుకు తిరిగి రాలేదు. అతనికోసం శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య

రెంజల్, ఫిబ్రవరి 5: మండలంలోని నీలా గ్రామానికి చెందిన వివాహిత బొనిగిరి జ్యోతి (35) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.ఉదయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆరోగ్యం బాగుకాక పోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించామని ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి తాళ లేక ..

మాక్లూర్,ఫిబ్రవరి5: కల్లడి గ్రామానికి చెందిన వివాహిత వీణ (29) సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మీనాకు కల్లడికి చెందిన వ్యక్తితో వివాహం కాగా భర్తతో విడాకులు తీసుకొని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. తరచూ కడుపునొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు కూతురు ఉంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ స్టౌవ్‌లు రిపేర్ చేస్తామని వచ్చి చోరీ

భీమ్‌గల్, ఫిబ్రవరి 5: మండలంలోని సుదర్శన్‌నగర్ తండా గ్రామంలో గ్యాస్ స్టౌవ్‌లు రిపేర్ చేస్తామని వచ్చి దుండగుడు ఓఇంట్లో చోరీ చేసినట్లు సీఐ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. గ్యాస్ స్టౌవ్‌లు, బీరువాలు రిపేర్ చేస్తామంటూ ఆదివారం మధ్యాహ్నం ఒకరు బోదాసు ఎల్లవ్వ ఇంటికి వచ్చాడు. బీరువాను రిపేర్ చేయాలని ఎల్లవ్వ చెప్పింది. ఆమె ఇంట్లోకి వెళ్లి బీరువాను రిపేర్ చేసిన నిందితుడు బీరువాలోని నాలుగు తులాల బంగారం దొంగలించుకుని వెళ్లాడు. ఎల్లవ్వ కొడుకు పోశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలించారు. భీమ్‌గల్‌లో నిందితుడు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దొంగిలించిన బంగారంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు షేక్ సద్దాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. అపరిచిత వ్యక్తులెవరైనా గ్రామంలో తిరిగితే వారు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, 100కు కాల్ చేయాలని సూచించారు.

క్వార్టర్ ఫైనల్‌కు నిఖత్ జరీన్

కంతేశ్వర్, ఫిబ్రవరి 5: బల్గేరియాలోని సోఫియాలో జరుగుతున్న 75వ స్ట్రాండ్జా అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ సత్తా చాటారు. మంగోలియన్ బాక్సర్ పై 3-2 తేడాతో గెలిచి క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించారు. తరువాతి మ్యాచ్‌లో 8వ తేదీన ఫ్రాన్స్‌తో తలపడనున్నది. అద్భుతమైన ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్‌ను పలువురు క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

పాతంగల్ విండో డైరెక్టర్ల రాజీనామా

కోటగిరి, ఫిబ్రవరి 5 : పాతంగల్ విశాల సహకార పరపతి సంఘం సభ్యులు (డైరెక్టర్లు) సోమవారం తమ పదవులకు రాజీనామా చేసి, పత్రాలను సీఈవోకు అందజేశారు. ఇటీవల నిర్వహించిన సంఘం మహాజన సభలో సభ్యులందరూ పాలకవర్గాన్ని రద్దు చేయాలని తీర్మానం చేశారు. పదవుల్లో ఉన్న తమకు ఎలాంటి గుర్తింపు లేదని, వ్యక్తిగత కారణాలతో పదవులకు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

టీయూ రిజిస్ట్రార్ కార్యాలయం ముట్టడి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5 : టీయూలోని రిజిస్ట్రార్ కార్యాలయాన్ని విద్యార్థులు సోమవారం ముట్టడించారు. హాస్టల్‌లో మెస్ బిల్లుల పేరిట విద్యార్థులపై అదనపు భారం మోపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని తరగతులను బహిష్కరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కొవిడ్ తర్వాత ధరలు పెరిగాయంటూ విద్యార్థులపై అధిక భారం మోపుతున్నారని ఆరోపించారు. మెస్ బిల్లులను మాఫీ చేయాలని డిమాండ్‌చేశారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 5 : నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం రెండో నంబర్ ప్లాట్‌ఫాం ట్రాక్‌పై వచ్చిన రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 40 సంవత్సరాలు ఉంటుందని, మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదని పేర్కొన్నారు. మృతుడి సంబంధీకులు నిజామాబాద్ రైల్వే పోలీస్ లేదా ఎస్సై- 87126 58591 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

'అభివృద్ధి పనులు ప్రారంభించుకునేందుకు అవకాశం కల్పించాలి'

సారంగాపూర్, ఫిబ్రవరి 5 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్‌డీఎఫ్ ద్వారా మంజూరు చేసిన నిధులతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించుకునేందుకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈద్గాలు, మసీదులకు ప్రహరీ నిర్మాణాలు, షాదీఖానా తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసి, ఉత్తర్వు కాపీలు కూడా తమకు అందించినట్లు పేర్కొన్నారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులు ప్రారంభించలేదని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను రద్దు చేస్తామని ప్రకటిస్తామన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అక్బర్ నవాజుద్దీన్, షేర్‌ఖాన్, షేక్ గబ్బర్, ముంతాజ్ బేగం, షేక్ రజాక్ ఉన్నారు.

ఈ-చలాన్లు చెల్లించేందుకు గడువు పెంపు

వినాయక్‌నగర్/ ధర్పల్లి, ఫిబ్రవరి 5 : వాహనాలపై ఉన్న ఫైన్లను రాయితీతో చెల్లించేందుకు ప్రభుత్వం గడువును మరోసారి పొడిగించినట్లు సీపీ కల్మేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 31వ వరకు గడువు ఉండగా ఫిబ్రవరి 15వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 తర్వాత స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. వాహనాలపై పెండింగ్ చలాన్లు ఉంటే మోటరు వాహనాల చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వాహనదారులు గడువు పెంపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ధర్పల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు.

సంక్షిప్తంగా..

■ డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5 : టీయూ పరిధిలో ఎంఎడ్ 1, 2, 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్నాయి. మూడో రోజు సోమవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 39 మందికి అందరూ హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

■ చందూర్, ఫిబ్రవరి 5 : మండలంలోని ఘన్‌పూర్ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు మొరం తవ్వుతుండగా గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. తహసీల్దార్ వద్ద పర్మిషన్ తీసుకున్నామని వాదించగా.. పర్మిషన్ లెటర్ చూపించాలని గ్రామస్తులు అడగడంతో వెనుతిరిగారు. అధికారులు మెరం తవ్వకాలను అడ్డుకోవాలని గ్రామస్తులు కోరారు.

■ రుద్రూర్, ఫిబ్రవరి 5 : మండలకేంద్రంలో రామాలయ పునర్నిర్మాణ పనులకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు విరాళాలు సేకరించారు. క్రాంతి నవయుగ గణేశ్ మండలి సభ్యులు రూ. 21వేలు, రుద్రూర్‌కు చెందిన తాటికొండ రాకేశ్ రూ.15,116, తాటికొండ శంకర్ రూ.21 వేలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, పత్తి నవీన్, అడప నవీన్, వెంకట్, రవి పాల్గొన్నారు.

■ భీమ్‌గల్, ఫిబ్రవరి 5: అనుమతులు ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిబాబు తెలిపారు. సోమవారం బాబాపూర్ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి గనుల శాఖకు సమాచారం అందజేశామన్నారు.

■ శక్కర్‌నగర్, ఫిబ్రవరి 5: బోధన్ రూరల్ సీఐగా నరేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాస్ రాజు బదిలీపై వెళ్లడంతో నరేశ్ ఆదిలాబాద్ నుంచి బదిలీపై వచ్చారు.

■ నవీపేట, ఫిబ్రవరి 5: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కామారెడ్డి జిల్లా గాందారి మండలానికి చెందిన యాచారం గ్రామానికి చెందిన పాత నేరస్తులు బాదవత్ వసంత్‌రావు, బాదవత్ ప్రవీణ్‌లను బైండోవర్ చేసినట్లు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్ తెలిపారు.

■ ఎడపల్లి, ఫిబ్రవరి 5 : దుబ్బతండా గ్రామంలో ఎడపల్లి పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులకు సైబ